www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025



ఎస్వీయూ విద్యార్థిపై దాడి

గాయపడ్డ విద్యార్థి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎస్వియూలో ఓ విద్యార్థిపై పూర్వ విద్యార్థి దాడికి పాల్పడ్డాడు.. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్వియూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు..శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థిపై పూర్వ విద్యార్థి, రౌడీషీటర్ మణికంఠ దాడికి పాల్పడ్డాడు. గతంలో ఎస్వి యూనివర్సిటీలో గతంలో మణికంఠ విద్యను అభ్యసించాడని, తరచూ ఎస్వియు క్యాంపస్ లోని హెచ్ బ్లాక్ లోకి వెళ్లి విద్యార్థులతో గొడవపడేవాడని తెలిపారు. ఇటీవల తనకు గౌరవం ఇవ్వలేదని ఎస్వీయూలోని హెచ్ బ్లాక్ విద్యార్థి వెంకటేశ్వర్లుతో గొడవపడ్డాడు. ఈ ఆక్రోశంతో హెచ్ బ్లాకు వద్దకు వెళ్లిన, పూర్వపు విద్యార్థి మణికంఠ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడికి చేశాడు. ఈ దాడిలో వెంకటేశ్వర్లు కాలుకు గాయాలయ్యాయి. స్పందించిన వెంకటేశ్వర్లు వెంటనే ఎస్వియూ క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఫిర్యాదు మేరకు మణికంఠపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పుస్తక ప్రదర్శన పై

మనువాదుల దాడి దారుణం

- ఖురాన్ విశ్లేషణపై మతోన్మాదుల చర్య దుర్మార్గం
- రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావుల ఖండన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

ఖురాన్‌ను విశ్లేషిస్తూ శర్మ అనే వ్యక్తి తెలుగులో రాసిన గ్రంథాన్ని కొందరు హిందూ మతోన్మాదులు చించి పోగులు పెట్టి, వీరంగం సృష్టించారు. తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో శుక్రవారం సాయంత్రం 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేస్తూ, ఆ పుస్తకాన్ని తగలపెట్టడానికి విఫలయత్నం చేశారు. అబద్దాలతో, బూతులతో విరుచుకుపడ్డారు. విశాలాంధ్ర బుక్ స్టాల్ వద్దకు కూడా వెళ్ళి హడావిడి చేశారు. ఈ సంఘటకు నిరసనగా 'సాహిత్యం, భావప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాద శక్తులు దాడులను అరికట్టాలి' అని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకట శివయ్య భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మేధావులు, రచయితలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించారు. అవి వారి మాటల్లోనే...

ఈ సంఘటన జరిగినప్పుడు పుస్తక ప్రదర్శనశాలలో అక్కడే ఉన్న వాకా ప్రసాద్, సాహితీవేత్త సాకం నాగరాజు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సంఘటన పూర్వాపరాలను **పౌరచైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్** వివరిస్తూ, 'ఒక స్టాల్ దగ్గర కేకలు వినిపిస్తే నేను, సాకం నాగరాజు పరిగెత్తుకుంటూ వెళ్లాం. ఒక పుస్తకాల షాపు నుంచి ఖురాన్‌లో ఇస్లాంకు, హిందూ మతానికి మధ్య ఉన్న సారూప్యతను విశ్లేషిస్తూ శర్మ అనే వ్యక్తి రాసిన పుస్తకాన్ని కొద్ది మంది హిందుత్వ వాదులు చించిపోగులు పెడుతున్నారు.. దాన్ని తగల పెట్టడానికి కూడా ప్రయత్నిస్తూ, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. విశాలాంధ్ర బుక్ స్టాల్ వద్దకు వచ్చి, జై శ్రీరాం అన్న నినాదాలతో, అసభ్యకర పదజాలంతో 'రామాయణ విష వృక్షం' రాసి అమ్ముతున్నారు. (రామాయణ విష వృక్షం రాసింది రంగనాయకమ్మ) తల్లిని, చెల్లెని పెళ్లి చేసుకోమని చెప్పే పెరియార్ పుస్తకాలు కూడా వీళ్లు అమ్ముతున్నారు' అంటూ తమ అజ్ఞానాన్ని ప్రదర్శించారు. మీకు ఏదైనా అభ్యంతరం ఉంటే పుస్తక ప్రదర్శన నిర్వాహకులకు చెప్పండి కానీ, ఇలా అరవడం, బూతులు తిట్టడం, దాడి చేయడం హిందుత్వానికే కళంకం తెస్తుందని నచ్చచెప్పాను.. పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేసిన భారతీయ విద్యాభవన్ అధ్యక్షులు సత్యనారాయణ రాజు అక్కడికి వచ్చి వారికి సర్ది చెప్పి, ఆ పుస్తకం అమ్మిన స్టాల్‌ను వెంటనే మూయించారు. వాళ్ళు చాలా అమానుషంగా ప్రవర్తించారు. ఇలాంటి సంఘటనలను ఖండించాలని కోరుతున్నాను.

అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మినారాయణ మాట్లాడుతూ "ఇది ఉన్మాద ప్రారంభ దశ. దేశంలో ఉన్మాదం పెరుగుతోందని అర్థం చేసుకోవాలి. మనం ఏం తినాలో, ఏ దుస్తులు వేసుకోవాలో, ఏ సాహిత్యం చదవాలో వీరే చెపుతారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం. తమ భావాలకు వ్యతిరేకమైన వాటిపై పాలక పక్షాలు దాడులుచేస్తాయి. సఫ్దర్ హష్మీని చంపేశారు. పెరుమాళ్ మురుగన్‌పై దాడులు చేసి, ఆయన పుస్తకాలను చించేశారు. 'రచయితగా చచ్చిపోయాను' అని ఆయన ప్రకటించాల్సిన పరిస్థితి తెచ్చిపెట్టారు. ఈ ఉన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య వేదికను ఏర్పాటుచేసి పోరాడాలి."

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ "మతోన్మాదాన్ని, మత దురహంకారాన్ని సహించడం వల్ల ఆ మతానికి కీడు జరుగుతుందే కానీ, మేలు జరగదు. రాజ్యాంగం ప్రకారం నిషేధించని పుస్తకాన్ని ఎక్కడైనా ఎప్పుడైనా అమ్ముకోవచ్చు. నిషేధించని పుస్తకాన్ని అమ్మకూడదనడం, అల్లరి చేయడం రాజ్యాంగం ప్రకారం నేరం. ఈ గడ్డపైన అన్ని మతాల వారు జీవించడానికి, వారి భావజాలాన్ని ప్రచారం చేసుకునే హక్కు వారికుంది. విశాలాంధ్ర హేతువాద, మార్క్సిస్టు భావజాలానికి అనుకూలమైనవి కనుకనే రామాయణ మహాభారతాలు కూడా అమ్ముతున్నారు" అని గుర్తు చేశారు.

సీనియర్ జర్నలిస్ట్ రాఘవ మాట్లాడుతూ "ఝుంఝు, లే కవితా సంకలనాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కొట్టి వేస్తూ, జస్టిస్ జీవన్ రెడ్డి ఇచ్చిన తీర్పులో 'ఏ ఆలోచననూ నిషేధించలేం. అలా నిషేధిస్తే మానవ సమాజం ముందుకు పోదు' అని వ్యాఖ్యానించారు. పుస్తకాలను నిషేధించడమే తప్పని భావిస్తున్నప్పుడు, అసలు నిషేధించని పుస్తకాలను వీళ్ళెలా అడ్డుకుంటారు? విజయవాడలో గూండాలకు వ్యతిరేకంగా చంద్రరాజేశ్వరరావు కర్రపుచ్చుకుని నిలబడ బట్టే వాళ్ల తోకముడిచారు. అవసరమైతే మతోన్మాదులకు వ్యతిరేకంగా తిరుపతిలో కూడా వీధిపోరాటాలకు దిగాల్సి ఉంటుంది" అని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ "ఆ గొడవ జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్నాను. పెరియార్ హిందూ వ్యతిరేకి అని చాలా నీచంగా మాట్లాడారు. మనం పెరియార్ పుస్తకాలను పట్టుకుని పూలే విగ్రహం నుంచి గాంధీ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించాలి. ఈ మతోన్మాదులు తిరుపతి కేంద్రంగా ఉన్మాదాన్ని ప్రచారం చేస్తున్నారు. గౌరీ లంకేష్‌ను, కల్బుర్గిని చంపిన వారిని ఊరేగించే పరిస్థితి వచ్చింది.

ప్రముఖ రచయిత, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ, "అన్ని భావాలు అర్థం చేసుకుంటే కానీ సత్యాన్ని అన్వేషించలేం. ఇది రాజ్యానికి, వ్యక్తికి మధ్య జరిగే పోరాటం. ఇది చాలా పెద్ద సమస్య. ఇది ఒక రకమైన ఫ్యాసిజం. సంఘర్షణ నుంచే అగ్ని పుడుతుంది అని ఛంఫిజ్ కాన్ అంటాడు. పెరుమాళ్ మురుగన్ పైన చేసిన దాడి అతన్ని అంతర్జాతీయ స్థాయి రచయితను చేసింది. సృజన కారుడికి ఇది చాలా పెద్ద సమస్య. సత్యం చెప్పడానికి భయపడుతున్న కాలం ఇది. అలాంటి పరిస్థితి రాకుండా కలిసి కట్టుగా సహకరించాలి. గళమెత్తి నిరసన తెలపాలి."

రాజ్యాంగ వేదిక అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ "ఇలాంటి బుట్ట బెదిరింపులకు మనం భయపడకూడదు. మనం కూడా రోడ్డు పైకి రావాల్సిందే. కులాల మధ్య, మతాల మధ్య, ప్రజల మధ్య సయోధ్య కుదర్చాలి. మాంసం తినకూడదంటూ పిరమిడ్ వారు 5వేల మందితో తిరుపతిలో ప్రదర్శన నిర్వహిస్తారట. మనం ఏం తినాలో, ఏం తినకూడదో వీళ్ల నిర్ణయిస్తారా?" అంటూ ప్రశ్నించారు.



సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ "బీజేపీ, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ వారు తిరుపతిపైన దృష్టి కేంద్రీకరించారు. దీంతో తిరుపతి డేంజర్ జోన్ లోకి వచ్చేసింది. ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పైన భజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేశారు. తిరుపతిలో గరుడ వారధికి టీటీడీ నిధులు ఇవ్వకూడదని బీజేపీ నాయకుడు భాను ప్రకాష్ కోర్టులో పిటీషన్ వేశారు. మదరసాలలో చిన్న పిల్లలకు చదువు చెప్పడం ఆపేయాలని ప్రయత్నించారు. వీళ్ళని తన్నే రోజులు వచ్చాయి. ఎవరు ఏం తినాలో వీళ్ల చెపుతారా? ఎదురు దాడి చేయకపోతే నష్టం జరిగిపోతుంది. ఈ రోజు పుస్తకాల దగ్గరకు వచ్చారు. రేపు ఇళ్ళ దగ్గరకు వస్తారు. భారతీయులకు సంకెళ్ళు వేసి స్వదేశానికి పంపితే బీజేపీ నాయకులు నోరు విప్పలేదు" అంటూ విమర్శించారు.

సాహితీవేత్త సాకం నాగరాజు మాట్లాడుతూ, "హిందు మత లక్ష్యం మత సామరస్యం అని వివేకానందుడు అన్నాడు. నిన్న జరిగిన సంఘటనతో ఒక హిందువుగా నేను తలదించుకుంటున్నాను. అన్యమతస్తులంటున్నారు. ఫోన్లు, టీవీలు, సెల్ ఫోన్లు, కనిపెట్టింది ఎవరు? అన్యమతస్థులు కాదా? వాటిని ఎలా వాడుతున్నారు? మతోన్మాదులు ఈ దేశానికి పెద్ద శత్రువులు" అంటూ హెచ్చరిక చేశారు.



సీపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనశాలలో విశాలాంధ్ర దగ్గరకువచ్చి మతోన్మాదులు అల్లరి చేయడం పై జిల్లా ఎస్ పీకి ఫిర్యాదు చేయాలని, 11వ తేదీ మంగళవారం సాయంత్రం అంబేద్కర్ భవన్ నుంచి గాంధీ రోడ్డు వరకు పెరియార్ పుస్తకాలతో ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా కార్యదర్శి ఏ.ఎన్. పరమేశ్వరరావు మాట్లాడుతూ, "దేశాన్ని 500 ఏళ్ళ వెనక్కి తీసుకెళ్ళాలని ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసమే పుస్తకాలను నిషేధించాలని చూస్తోంది." అన్నారు.

ఈ సమావేశంలో రచయితల సంఘం రాష్ట్ర నాయకులు శరత్ చంద్ర, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కరవది సుబ్బారావు, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ టి.జనార్ధన్, బిసి సంఘర్షణ సమితి నాయకులు బుసకాని లక్ష్మయ్య, కేశవులు, ఐద్వా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

బాధిత మహిళకు న్యాయం చేయాలి

కిరణ్ రాయల్ ఇంటిని ముట్టడించిన మహిళలు

కిరణ్‌రాయల్ ఇంటిని ముట్టడించిన మహిళలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : కిరణ్ రాయల్ చేతిలో మోసపోయిన మహిళ ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిపాలైన బాధిత మహిళకు వెంటనే న్యాయం చేయాలని, ఆ పార్టీ నుండి ఆయనను తొలగించాలని కోరుతూ కిరణ్ రాయల్ ఇంటిని మహిళలు ఆదివారం పెద్ద ఎత్తున ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై మీడియా ఎదుట కిరణ్ రాయల్ బాధిత మహిళను దూషించడంతో కోపోద్రిక్తులైన మహిళలు ఆదివారం ఆయన ఇంటిని ముట్టడించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళను మోసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. బాధిత మహిళ లక్ష్మిని మహిళా సంఘాలు కలిసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'మహిళలకు రక్షణ కల్పిస్తానన్న పవన్ కళ్యాణ్ ఇదేనా? మీరు కల్పించే రక్షణ?' అంటూ ఆయనను ప్రశ్నించారు. కిరణ్ రాయల్‌ను జనసేన నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. గొడవ చేస్తే అరెస్టు చేస్తామంటూ బెదిరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని మహిళలు భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు వారికి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపేశారు.

వెంకటయ్యకు న్యాయం చేయాలి

- 17న మఠం ముట్టడి
- రౌండు టేబుల్ సమావేశంలో దళిత సంఘాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కెవిబిపురం మండలం మఠం పంచాయతీ మాజీ దళిత సర్పంచి కలపాటి వెంకటయ్యకు న్యాయం చేయకుంటే ఈ నెల 17న మఠంను ముట్టడిస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. వెంకటయ్య దంపతు లపై దాడి చేసిన పెత్తందారులపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండు చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిన్నం కాళయ్య మాట్లాడుతూ మఠం ఘటన అంటరానితనానికీ, కుల వివక్షతకు నిలువెత్తు నిదర్శ నమన్నారు. వెంకటయ్యకు ప్రభుత్వం భూమిపై సర్వ హక్కులూ కల్పించినా అగ్రకులానికి చెందిన గల్లా సురేంద్ర కుటుంబం దాడి చేయడం వెనక రెవెన్యూ, పోలీసు వ్యవస్థల వైఫల్యం వుందని విమర్శించారు. వెంకటయ్యపై దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కేసు ఎందుకు నమోదు కాలేదని ప్రశ్నించారు. వెంకటయ్యపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారం రోజుల్లోగా భూమి అప్పగించాలని లేకుంటే ఈనెల 17న మఠం గ్రామాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, జైభీమ్ ఆర్మీ వ్యవ స్థాపకులు పులి శ్రీకాంత్, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య, కాంగ్రెస్ నాయకులు కూలి రవి, నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, చారులత, రాధమ్మ, రంగయ్య, బాధితుల వెంకటయ్య, పెంచలమ్మ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

శిక్షణ కోసం ముస్సోరికి కమిషనర్

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా చరణ్ తేజ్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల 10 నుండి 14 వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో నిర్వహించనున్న మునిసిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ నిమిత్తం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య ఆదివారం వెళ్లారు. ఈ ఐదు రోజుల పాటు కార్యాలయ కార్యక్రమాలు అంతరాయం లేకుండా నిర్వహించేందుకు అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈనెల 10వ తేదీ నుండి 14 వ తేదీ వరకు ఉత్తరాఖండ్ లోని ముస్సోరిలో మున్సిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ సివిల్ సర్వెంట్స్‌పై ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ తరపున తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్యను ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఆదివారం ముస్సోరి బయలుదేరి వెళ్లారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: 'డయల్ యువర్ కమిషనర్' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు 'డయల్ యువర్ కమిషనర్' అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చే వారి కోసం ఉదయం 10.30 నుండి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' నిర్వహించనున్నారు. ఫోను ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208 నెంబరుకు కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ప్రజలకు అదనపు కమిషనర్ తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేసే ఫోన్ నెంబర్లను తెలపాలని పేర్కొన్నారు.

మహనీయుల జీవిత చరిత్ర చదివి బుద్ధి తెచ్చుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మతం పేరుతో ఉన్మాదులుగా వ్యవహరిస్తున్న వారు, మహనీయుల జీవిత చరిత్ర చదివి బుద్ధి తెచ్చుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి నగరంలో కొందరు హిందూ ప్రతినిధులమని చెప్పుకుంటూ హిందూ మతానికి తీవ్రమైన ద్రోహం చేస్తున్నారన్నారు. భక్తులకు సేవ చేస్తున్న కార్మికుల కష్టాలపై స్పందించే కమ్యూనిస్టుల , దళిత సంఘాల, అంబేద్కర్, పెరియార్, జ్యోతిరావు పూలే వంటి మహనీ యులపై అవాస్తవ ప్రచారం చేయడం అన్యాయమని, అప్రజాస్వామికంగా దౌర్జన్యాలు చేయడం, వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం, దూషించడమే వీరి ప్రధాన ఉద్దేశం అన్నారు. శనివారం పుస్తక ప్రదర్శనలో తమకు అభ్యంతరమైన పుస్తకాలు ఉంటే నిర్వాహకులకు ఫిర్యాదు చేయాలని, కాని ఆటవిక పద్ధతిలో పుస్తకాల షాపులపై గొడవ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి సీనియర్ నాయకులు భక్తవత్సలం సైతం వారి తీరును దుయ్యబట్టారని గుర్తు చేశారు. గుంపుగా వచ్చి అనాగరికంగా వాదనకు దిగిన వారిని తాను మాత్రమే ఎదిరించినట్లు చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం హేయమన్నారు. దీనిపై రౌండు టేబుల్ సమావేశం లో మేధావులు, కవులు, రచయితలు ఖండించారని వారిని చూసైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

తిరుపతి సిటీ: గొప్ప మానవతావాది మూఢ సిద్ధాంతాలను, నమ్మకాలను, కులతత్వాన్ని వ్యతిరేకించి మానవులందరూ సమానమేనని అందరికీ సమానమైన స్వేచ్ఛ స్వాతంత్రం ఉండాలని, స్వతంత్రంగా ఎదగడానికి సమాన అవకాశాలు కావాలని ఏడు దశాబ్దాలు ఉద్యమం చేసిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి నాయకర్ అని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు టీ గోపాల్ తెలిపారు. తిరుపతిలోని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీసీ ఉద్యోగుల సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడు తూ శనివారం తిరుపతిలో పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో కొందరు పెరియార్ జీవిత చరిత్ర పుస్తకా లు ప్రదర్శన ప్రాంగణంలో ఉండకూడదని వివాదం సృష్టించిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిసిఈఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సురేష్ బాబు,పాల్గొన్నారు.

ఈసిఈలో ఝాన్సీలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగపు పరిశోధక విద్యార్థిని కే ఝాన్సీలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎస్వీయూ పరీక్షల అధికారి దామ్లా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసిఈ ఆచార్య జి శ్రీనివాసులు పర్యవేక్షణలో 'ఏ కంపాక్ట్ డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎ హైబ్రిడ్ ఎఈఎస్ 256 కిరాక్ టెక్నిక్ ఇన్ ఎస్‌హెచ్ఏ 3-512 ఫర్ ఇన్హెన్సింగ్ డేటా సెక్యూరిటీ యూజింగ్ ఎఫ్ ఫిజిఏ 'అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఝాన్సీ లక్ష్మి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లలో అనేక పరిశోధనా వ్యాసాలు ప్రచురించి నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీకి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

తిరుపతి జిల్లా జేఏసీ డిమాండు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసి డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకత్వం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ని కలిసి ఈ సమస్యను ముఖ్యమంత్రిగా దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు (చినబాబు) ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, (ఎస్ జయచంద్ర) సిఐటియు జిల్లా కార్యదర్శి, (గండికోట నాగవెంకటేష్) తిరుపతి జిల్లా జేఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే, పారదర్శకత లోపించి, నిజమైన మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, రాజకీయ ప్రమేయం, ఇతర అనైతిక ప్రభావం పెరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదని అందువల్ల, ప్రభుత్వమే నేరుగా నియామక ప్రక్రియ నిర్వహించి, (ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ) ద్వారా ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఔట్సోర్సింగ్ నియమకాలపై పెద్ద ఎత్తున అవినీతి , అక్రమాలకు పాల్పడిన చరిత్ర వుందన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేసే దళారులు తయారయ్యారని, నియామకాలలో పారదర్శకత, సామాజిక న్యాయాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. ప్రభుత్వం తప్పుకోవడం, ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట అన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా చెక్కును అందిస్తున్న దృశ్యం

లక్ష్యం దిశగా చదవండి..

సిర్డ్ సంస్థ స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

విద్యార్థు లు లక్ష్యం దిశగా చదవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నా రు. పేద విద్యార్థులకు సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'బ్యాక్ టూ స్కూలు' కార్యక్రమంలో భాగంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 150 మంది విద్యార్థు లకు 25 లక్షల రూపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకుని అందుకు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి సౌకర్యాలు లేవని ఉంటే ఎంతో మంది చదువు కునే వాళ్లమని తెలిపారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో తమకు ఇలా చెప్పే వాళ్లు ఎవరూ లేరని, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో వుంటూ పది మందికి సహాయం చేస్తున్నామన్నారు. ప్రతి పిల్లవాడు ఈ రోజుల్లో సెల్ ఫోన్స్ గేమ్స్‌కు బానిసై పోతున్నారన్నారని, దీన్ని వదిలి చదవడం, రాయడం స్పష్టంగా నేర్చుకోవాలన్నారు. నేడు సిర్డ్స్ సంస్థ ద్వారా 25 లక్షలు రూపాయలు 150 మంది పిల్లలకు అందించడం అభినందనీయమన్నారు. దాత కొండవీటి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి పిల్లవాడు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్యాక్ టూ స్కూలు ద్వారా పేద పిల్లలందరినీ గుర్తించి వారికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని ఇందులో భాగంగా 150 మంది పిల్లలకు 25 లక్షల రూపాయలు స్కాలర్‌షిప్‌లు అందించామన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన రొక్కం మోహన్‌కి, అను శృతికి, మనీష్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్డ్స్ సంస్థ డైరెక్టర్ స్వాతి, సిర్డ్స్ సంస్థ టీచర్స్, వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలిపిరి రోడ్డు అస్తవ్యస్తం

- రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు
- ప్రమాదాలకు నిలయం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీవారి భక్తులు తిరుమలకు చేరుకునేందుకు, ట్రాఫిక్ జామ్ సమస్య నుంచి బయటపడేందుకు ఏర్పాటు చేసిన అలిపిరి-చెర్లోపల్లి బైపాస్‌రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి రహదారి కి అడ్డంకిగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలతో నిండి పోయింది. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంత జరుగుతున్నా టిటిడి అధికారులు అటుపక్క చూస్తే ఒట్టు.. నిత్యం అదే దారిలో పయనిస్తున్నా స్పందించక పోవడం గమనార్హం.

తిరుమలకు వెళ్లేందుకు శ్రీవారి భక్తులకు అలిపిరి బైపాస్‌రోడ్డు ఎంతో కీలకం. బెంగుళూరు, వేలూరు, చిత్తూరు, అనంతపురం, కడప, రాయచోటి , మదనపల్లి మీదగా వచ్చే వాహనాలన్నీ చెర్లోపల్లి సర్కిల్ నుంచి ఎస్వి జూపార్కు మీదగా అలిపిరి బైపాస్‌లో ప్రయాణించి, తక్కువ సమయానికి అలిపిరికి చేరుకుంటాయి. తిరుపతి నగరానికి ప్రవేశించే ప్రధాన రహదారి కంటే ఈ రోడ్డుపై వెళితే పది కిలోమీటర్లు మేర తగ్గుతుంది. అందుకు వాహనదారులు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగించుకుంటారు. కానీ గత కొన్ని నెలలుగా ఈ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరిగి పోవడంతో రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయి. జీబ్రా లైన్లు, సూచిక బోర్డులు సైతం పిచ్చి మొక్కల మధ్య ఇరుక్కుపోయాయి. ముళ్లపొదలు, రాగి మొక్కలు అధికంగా వుండడంతో రోడ్డుకు పక్కగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు అవి గుచ్చుకుని గాయాల పాలవుతున్నారు. చాలా మందికి సూచిక బోర్డులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు, అటు టిటిడి ఇంజనీరింగ్, అటవీశాఖ,

రోడ్డుకు ఇరు వైపులా ప్రమాదకర స్థితిలో వ్యాపించిన పిచ్చి మొక్కలు

ఆర్అండ్‌బి అధికారులు ఒకరిపై ఒకరు దాట వేసుకుంటూ తాము కాదంటే తాము కాదని తప్పించుకుంటున్నారు. ఇదే అదునుగా భావిస్తూ నగరంలో పలు హోటళ్లు, చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలన్నిటినీ అలిపిరి బైపాస్ రోడ్డులో అన్‌లోడ్ చేస్తున్నారు. ప్రమాదాలకు తోడు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే దుర్గంధం తప్పడం లేదు. పైగా అదే దారిలో టాటావారి సూపర్‌స్పెషాలిటీ కేన్సర్ ఆస్పత్రి, అరవింద్ ఐ ఆస్పత్రి, ఎస్వి జూపార్కు, సైన్స్ సెంటర్, ఏపి టూరిజం కళాశాల, వేదిక్, వెటర్నరీ, ఎస్వియు యూనివర్సిటీల ఉద్యోగులు, విద్యార్థులు, భారతీయ విద్యాభవన్ చిన్నారులు, టిటిడి ఎస్వీబిసి చానల్ కార్యాలయం వంటి ప్రముఖమైన సంస్థలు, కార్యాలయాలు, ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, కార్పొరేషన్ అధికారులు, టిటిడి, అటవీశాఖ, ఆర్అండ్‌బి అధికారులు నిత్యం ఇదే దారిలో ప్రయాణిస్తుంటారు. ప్రతి రోజూ అక్కడ జరిగే ప్రమాదాలను గమనిస్తున్నా కనీసం స్పందించకపోవడం దారుణం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించి, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులను, వాహనదారులను, పాదచారుల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

శాశ్వత రహదారి ఏర్పాటుకు కృషి చేస్తా

దారి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: జాతీయ రహదారి విస్తరణలో తిప్పిరెడ్డిగారిపల్లి, జంగావాండ్లపల్లి, చిన్నగొట్టిగల్లు పంచాయతీ పరిధిలోని పల్లెల ప్రజలకు దారి సమస్య ఏర్పడి రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈవిషయాన్ని టిడిపి నాయకులు బెల్లంకొండ మురళి, కొట్టే శివకుమార్, ఆర్వీ.రమణారెడ్డి, సంద్రా మోహన్ రెడ్డి, చట్టేవారి పాళెం బాబు, టిడిపి వెంకీ, గువ్వల నాగిరెడ్డి, జెడి బాలాజి,మల్లికార్జున తదితర నాయకులు ఎమ్మెల్యే నానికి వివరించారు. స్పందించిన ఆయన ఆదివారం స్వయంగా సమస్య ప్రాంతాన్ని పరిశీలించారు. చిన్నగొట్టిగల్లులోని మసీదు వీధి నుండి కుమ్మరపల్లికి వెళ్లే దారిని తాత్కాలికంగా పునరుద్దరింపజేసారు. శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆఫ్కాస్ రద్దు తగదు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆఫ్కాస్ సంస్థను రద్దు చేయాలనే ఆలోచన మానుకుని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆఫ్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందన్నారు. ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. దళారీ వ్యవస్థను తెచ్చి పెట్టినట్లయితే ఆందోళనల్ని ఉధృతం చేయాల్సి వస్తుందని అన్నారు. అనంతరం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు గూడూరు మున్సిపాలిటీ గౌరవాధ్యక్షులు జోగి శివయ్య, సి ఐ టి యు బాధ్యులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ జోక్యం చేసుకొనివెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దారా కోటేశ్వరరావు, తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

చెరుకు రైతుల బకాయిలు చెల్లించండి

దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - కే వి బి పురం: చెరుకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా నింద్ర మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం 35 కోట్లు, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని మయూర షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం 20 కోట్ల రూపాయలు చెల్లించకుండా మోసం చేశారన్నారు. రైతులకు యాజమాన్యాలు చెల్లించాల్సిన బకాయిలపై గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో బకాయిలు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారనా, అధికారం చేపట్టి పది నెలలు గడిచినప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదన్నారు.

అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసిపి సానుభూతిపరులపై అక్రమంగా కేసులు పెట్టించి వారిపై దాడులు చేయిస్తున్నారని, వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. గూడూరు మండలం, మంగళపూరులో వైసిపి సానుభూతిపరుడు సతీష్ యాదవ్‌ను ఆయన ఆదివారం పరామర్శించారు. సతీష్ యాదవ్‌ను ఫ్లెక్స్ చించివేశాడనే అనుమానంతో పోలీసులు తీసుకువెళ్లి కొట్టారన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలకు ధైర్యం ఉంటే ఇప్పుడు ఎన్నికలు జరిపించాలని ప్రజల తీర్పు ఎలా ఉంటుందో తెలుస్తుందని సవాల్ విసిరారు. కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ మేరీగ మురళి మాట్లాడుతూ రాజకీయాలు హుందాతనంగా చేయాలని, కక్షపూరితంగా కేసులు పెట్టి గాయపరచడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యద్దల నరేందర్ రెడ్డి, గూడూరు ఎంపిపి గురవయ్య, వాయిగండ్ల నాగరాజు, సునీల్ రెడ్డి, మెట్టా రాధారెడ్డి, మధుసూదన్ రెడ్డి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా


ఆలయంలో మాజీ మంత్రి రోజాను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, కాపు వీధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ ఏకాంబరం, చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్ డి.శంకర్, మాజీ ఆలయ చైర్మన్లు లారీ మోహన్, మనోహర్ రెడ్డి, అన్నా లోకనాథం, మూర్తి, గోపి రాయల్, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ లోడును ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వేసవిలో పెరగనున్న విద్యుత్ లోడును ఎదుర్కోవడానికి కావలసిన సబ్ స్టేషన్‌లకు, కొత్త లైన్‌ల అవసరాల గురించి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం పుత్తూరు డివిజన్ విద్యుత్ అధికారులతో చర్చించారు. వడమాలపేట మండలం, ఎస్వీ పురం దగ్గర 132/33, సబ్ స్టేషన్ ప్రతి పాదన గురించి వాకబు చేశారు. బుట్టిరెడ్డి కండ్రిగ, కే బి ఆర్ పురంలో నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, పుత్తూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) దేవఆశీర్వాదం, కన్స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలాజీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ నాయుడు, వడమాలపేట ఏఈ భాస్కర్‌లు పాల్గొన్నారు.

గుడి మాన్యం.. గుటుక్కు

చెన్నకేశవ స్వామి ఆలయ మాన్యం భూమికి కంచెవేసి, గేటుకు తాళం వేసిన వైనం

భూ కబ్జాకు కాదేదీ అనర్హం.. అన్నట్టు, గుడి, బడి, స్థలం, పొలం, మేత భూమి, బీడు భూమి ఏదైనా సరే.. చివరకు స్మశానమైనా వదిలేది లేదు. దర్జాగా కబ్జా చేయడం, కంచె వేసెయ్యడం. తాయిలాలతో ప్రభుత్వ అధికారులను చెప్పు చేతుల్లో పెట్టుకోవచ్చునన్న ధీమా, కబ్జాదారులకు వత్తాసు పలికే కొంత మంది ప్రభుత్వ సిబ్బంది.. దీంతో ఏమిచేసినా అడిగేవారు లేరన్న ధీమాతో బడాబాబులు (భూబకాసురులు) భూకబ్జాలకు పాల్పడుతున్నారు. - ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు

ఓభూబకాసురుడి కన్ను బొంతినాయిని చెరువు కింద వున్న సర్వే నెంబరు 2502లో 0.08 సెంట్ల చెన్నకేశవ స్వామి ఆలయ భూమిపై పడింది. ఆ భూమి ఆలయ మాన్యమని తెలిసి కూడా కంచె వేసి, గేటు పెట్టి, తాళం వేసేశాడు. అందులో మామిడి చెట్లు నాటడంతో గ్రామస్తుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆలయాల, మాన్యాల దుస్థితి

భక్తులు ఆలయాలకు కొంత భూమిని మాన్యంకింద సమర్పించుకునేవారు. వాటిపై వచ్చే ఆదాయంతో, దూపదీప నైవేద్యాలు, గుడిని నమ్ముకున్న పూజారులకు జరుగుబాటు ఉండేది. ఇలాంటి భూములు ఆలయ మాన్యాలుగా రికార్డుల్లో వుంటాయి. ఇటు దేవాదాయశాఖగాని అటు రెవిన్యూశాఖగాని పట్టించుకోక పోవడంతో కొన్ని దేవాలయాలు జీర్ణోద్ధరణకు కూడా నోచుకోలేదు. ఆలయ భూముల మాన్యాలయితే అడిగేవాడు లేనందున, దోచుకునే ప్రబుద్ధులకు మంచి అవకాశంగా మారాయి. ఆలయ భూములు ఎవరైనా గుత్తకు తీసుకున్నా, కొంత ఆదాయం ఆలయ నిర్వహణకు చెల్లించాలి. కానీ ఎవరూ ముళ్లకంచె వేసి, గేటు పెట్టి తాళం వేసి శాశ్వతంగా స్వాదీనం చేసుకొన్న దాఖలాలు లేవు.

ఆలయ మాన్యమైన 2502 సర్వే నంబరు భూమికి వేసిన ముళ్లకంచె తొలగించి, ఆలయ మాన్యాలకు భద్రత కల్పించి, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎవరైనా ప్రభుత్వ ఆస్తులు, ఆలయ మాన్యాలు కబ్జా చేస్తే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయ మాన్యాలివే

చెన్నకేశవ స్వామి ఆలయానికి ఒక్క చిట్టేచెర్ల గ్రామంలోనే సుమారు 10 ఎకరాలు వరకు భూమి వుంది. దీని విలువ కోట్లల్లో పలుకుతుంది. చిట్టేచెర్ల గ్రామ లెక్కల ధాఖలా సర్వే నెంబర్లు 431 వెంకట్రాయుని చెరువు కింద 0.28సెంట్లు, 234 కొమ్మల మడుగు కింద 0.48 సెంట్లు, 603 కామాక్షం చెరువు కింద 0.34 సెంట్లు, 941కొత్త చెరువు కింద 0.12 సెంట్లు, 1105 వసంత నాయుని చెరువు కింద 0.09 సెంట్లు, 1222 గుట్టవాని కుంట కింద 0.25 సెంట్లు,1507 గోవిందరాజులు చెరువు కాలువ కింద 0.22 సెంట్లు,1562 బ్రాహ్మణ చెరువు కింద 0.13 సెంట్లు, 1600 గాలివానికుంట కింద 0.09సెంట్లు, 1782 బ్రాహ్మణ చెరువు కింద 0.03సెంట్లు, 1898 పోలిశెట్టి కుంట కింద 0.10సెంట్లు, 1921 దామర్ల చెరువు కింద 0.09 సెంట్లు, 1951 అప్పినాయని చెరువు కింద 0.25సెంట్లు, 2094 పొదలకుంట కింద 0.23 సెంట్లు, 2401 కొర్లకుంట కింద 0.13 సెంట్లు, 2502 బొంతినాయిని చెరువు కింద 0.08 సెంట్లు, 2602 కేశవకుంట కింద 0.13సెంట్లు 2051 కుష్కి, 3ఎ 46 సెంట్లుతో పాటు 4 చింతమాన్లు (ప్రాథమిక సమాచారం) ఆలయానికి చెందినదని రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

అన్నదమ్ముల మధ్య రాజీ చేయడానికి వచ్చిన వ్యక్తి హత్య

మృతి చెందిన పాపయ్య నాయుడు, ఫైల్ ఫోటో

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): అన్నదమ్ముల మధ్య సయోధ్య కుదర్చటానికి వచ్చిన మధ్యవర్తి హత్యకు గురైన సంఘటన చంద్రగిరిలో ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. వివరాలకెళితే ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పి.కొత్త కోటకు చెందిన అన్నదమ్ములు హరి నాయుడు, రాజేష్‌ల మధ్య కొంతకాలంగా ఆర్థిక తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదిన వారి బంధువు చంద్రగిరికి చెందిన పాపయ్య నాయుడు అన్నదమ్ములకు మధ్యవర్తిత్వం చేశాడు. పాపయ్య నాయుడు జోక్యాన్ని సహించుకోలేక అన్నదమ్ములిద్దరూ కలిసి అతనిపై దాడి చేశారు. వారి దాడిలో పాపయ్య నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు అతనిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పాపయ్య నాయుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామగిరి ఆలయ అర్చకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చా టూరు తిరుపతి జిల్లా: పిచ్చాటూరు మండలం, రామగిరి శ్రీ వాలీశ్వర ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ గురుక్కల్ శనివారం శివైక్యం చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం ఉదయం ఆయన స్వగృహం చేరుకొని ఆయన బౌతిక కాయానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, ఆరణియార్ ఆయకట్టు సంఘం చైర్మన్ రవి రెడ్డి, అడవి శంకరాపురం చెరువు ఆయకట్టు చైర్మన్ పద్దురాజు తదితరులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల జే ఏ సి సమావేశం

సమావేశంలో ఉద్యోగులు సంఘీభావం

ప్రజాశక్తి -కోట : తిరుపతిలో ఎన్ జి ఓ భవనంలో మాల ఉద్యోగుల జేఏసీ సమావేశం ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మాల ఉద్యోగులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ ఐక్యతగా ఉండి లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు మీజూరు మాధవ్, ప్రధాన కార్యదర్శి పాల మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు నాగేంద్ర ,సంయుక్త కార్యదర్శులు సిద్దేష్, కుదురు కోటేశ్వర రావు, లీగల్ అడ్వైజర్ దాసరి అశోక్ కాంబ్లే లు పాల్గొనడం జరిగింది.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నగరంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివారం స్థానిక శ్రీనివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్పై పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ నడిరోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలపవద్దని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని, ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను తరలించేందుకు సహకరించాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా అమిగోస్ యండి అనిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కటింగ్ చేస్తున్న అమిగోస్ యండి అనిత్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మధ్య తరగతి ప్రజల చిరకాల ఆకాంక్ష సొంతింటి కల. ఆ స్వప్నం నెరవేర్చేందుకు అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ యాజమాన్యం అతి తక్కువ ధరలకు అపార్టుమెంట్స్ అందిస్తున్నారు. అమిగోస్ అధినేత అనిత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ సచివాలయం ఎదురుగా అత్యంత సుందరంగా, ఉత్తమ నాణ్యతా ప్రమాణాలతో రెడ్వోక్స్ అపార్టుమెంట్స్ సిద్ధమైందన్నారు. ఇందులో క్లబ్స్, స్విమ్మింగ్ పూల్, జిమ్, పిల్లలకు ఆటస్థలం వంటి సకల వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగల వారు అపార్టుమెంట్స్‌ను సందర్శించాలని కోరారు. బుక్ చేసుకున్న వారికి చదరపు అడుగుపై భారీ తగ్గింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, రమేష్ బాబు, కొండారెడ్డి, నాని, కోటి, విజయ్, శ్రీనాథ్ రెడ్డి, ఆర్.ఆర్ రెడ్డి, సాగర్, నిజాం, శ్రీనివాలు, సిద్ధిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీని బాగు చేయించిన జనసేన పార్టీ నాయకుడు గోవర్ధన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గోపాలకృష్ణాపురం పంచాయితీలో డ్రైనేజీ పూడిక తీత పనులను జనసేన పార్టీ నాయకుడు గోవర్ధన్ సొంత నిధులతో ఆదివారం చేయించారు. ఎన్నో రోజులుగా డ్రైనేజీల్లో పూడిక తీయ్యక పోవడంతో దోమలు ఎక్కువై స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో పర్యాయాలు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎస్టీలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతం కావడంతో ఎవరూ స్పందించలేదన్న విమర్శలు కూడా వచ్చాయి. దీంతో స్వయంగా స్పందించిన గోవర్ధన్ జేసీబీని తెప్పించి కూలీల సాయంతో పూడిక తీయించారు. స్థానికులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఎఫ్ఆర్ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దొరస్వామి

సమావేశంలో మాట్లాడుతున్న అసోషియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర అటవీ క్షేత్రాధికారుల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశాన్ని ఆదివారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని బయోట్రీవ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా సర్కిల్ అధ్యక్ష, కోశాధికారుల పోస్టులకు సంబంధించి ఖాళీగా ఉండడంతో ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దొరస్వామి, కోశాధికారిగా ప్రియాంకలను ఎన్నుకున్నట్లు ప్రతినిధులు ప్రకటించారు.

వెంకటేశ్వర్లుకు పిజి ప్రవేశ పరీక్ష అడ్మిషన్ల బాధ్యత

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి పీజీ, పిహెచ్డి, ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసే బాధ్యతను అప్పగించింది. పీజీ, పిహెచ్‌డీల్లో చేరాలంటే ఎంట్రన్స్ ద్వారా మాత్రమే చేరాలని దిశా నిర్దేశం చేసింది. ఈ నియమాలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి విశ్వ విద్యాలయాలకు, ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహించేందుకు సంబంధించిన నియామక బాధ్యతలను అప్పగించింది. ఆయా వర్సిటీల నుంచి కన్వీనర్లను నియమిస్తూ చైర్మన్ ఆచార్య మధురమూర్తి, సెక్రటరీ కృష్ణమూర్తి ఉత్తర్వులు అందజేశారు. అందులో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఏపి పిజి సెట్, ఏపిఆర్ సెట్ 2025-26 సెట్లను నిర్వహించే బాధ్యతలను ఉన్నత విద్యామండలి అప్పగించింది. ఈ బాధ్యతలను ఆచార్య పిసి. వెంకటేశ్వర్లుకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

7వ రోజు కొనసాగిన పశువైద్య విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఏడవ రోజుకు చేరింది. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 30 మంది రక్తదానం చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మె రాజకీయ కోణం కాదని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్టైపెండ్ పెంచకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో వశిష్ట విద్యార్థులు ప్రతిభ

బహుమతులు అందుకుంటున్న విజేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విజయవాడకు చెందిన హైదరాబాదు విశ్వం ఎడ్యుకేట్ ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో వశిష్ఠ, చైతన్య పాఠశాల విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ చాటారు. సీనియర్స్ విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంకును అప్సియా, రామన్, థ్రాడ్ ర్యాంకును నవనీత్, నందకిషోర్, జూనియర్స్ లెవెల్లో చైతన్య పాఠశాల విద్యార్థులు స్టేట్ సెకండ్ ర్యాంక్ పృథ్వీరాజ్, మూడవ ర్యాంకు విహాన్ రాజ్ కైవాసం చేసుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చైతన్య పాఠశాల విద్యార్థి పృథ్వీరాజ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వశిష్ట చైతన్య పాఠశాల కరస్పాండెంట్ కొండూరు రెడ్డయ్య రాజు, ఉపాధ్యాయులు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

శాఖాహారంపట్ల మరింత అవగాహన కల్పించాలి

శాఖాహార ర్యాలీని ప్రారంభింస్తున్న ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా తిరుపతి స్పిర్చువల్ సొసైటీ మెగా శాఖాహార ర్యాలీ నగరంలో ఆదివారం ఉదయం నిర్వహించింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మెగా శాఖాహార ర్యాలీ ద్వారా స్పిర్చువల్ సొసైటీ ప్రజల్లో శాఖాహారం పట్ల అవగాహన తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు యోగా, ధ్యానాలను తమ దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న ఒత్తిడిని జయించడానికి యోగా చక్కని పరిష్కారమార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయలు, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పోరేటర్లు నరసింహాచ్చారి, ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, సింగంశెట్టి సుబ్బరాయులు, వరప్రసాద్, కూరపాటి సురేష్ కుమార్, కోదండ, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలం కాపాడండి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): సురేంద్రబాబు అనే వ్యక్తి దొంగ స్వామి అవతారమెత్తి, తిరుచానూరులోని మా 12 ఎకరాల పొలాన్ని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కాజేయాలని చూస్తున్నాడని వై.నాగిరెడ్డి ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ భూమిని కౌలుకు తీసుకుని, అందులో వారాహి అమ్మవారి విగ్రహాలను పెట్టి, తాను స్వామినని స్థానికులను మోసం చేస్తున్నాడన్నారు. మా భూమి విషయంలో ఉన్నతాధికారులు కలుగజేసుకొని తమకు అప్పజెప్పే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు విశ్లేషణాత్మక ఆలోచనలు చేయాలి

- ఆస్పైర్ - 2025లో వక్తలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు నేడున్న పోటీ ప్రపంచంలో విశ్లేషణాత్మక ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందని ఐసిఎంఎఐ అధ్యక్షులు సీఎంఏ బిభుటి భూషణ్ నాయక్ సూచించారు. ఆదివారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఆదివారం ఆస్పైర్ - 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు సమాజంలో కీలకమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు తమ మేధో శక్తికి పదును పెట్టి భిన్నమైన ఆలోచనలకు తమ సృజనాత్మకతను జోడిస్తే మంచి అవకాశాలను చేజిక్కించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టిసిఏ సీఎంఏ శ్రీనివాస ప్రసాద్, సీసీఎం సీఎంఏ వినయ్ రంజన్, ఎస్ఐఆర్సి చైర్మన్ సిఎంఎ విశ్వనాథ భట్, తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ సీఎంఏ పార్థసారథి పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎంఏ ప్రతినిధులు

క్రైం న్యూస్

భారీ చోరీ

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ తుడా క్వార్టర్స్ లోని ఎంఐజి 81లో నివసిస్తున్న స్విమ్స్ సూపరింటెండెంట్ ఏఆర్ నరేంద్రబాబు ఇంట్లో 188 గ్రాముల బంగారం, రూ.48 వేల రూపాయల నగదు దొంగలు దోచుకెళ్లారు. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథం, బాధితుల కథనం మేరకు నరేంద్రబాబు భార్య వెన్నెముక సమస్యతో ఈనెల 5వ తేదీ స్విమ్స్ హాస్పిటల్‌కు సర్జరీ నిమిత్తం వెళ్లారు. 8వ తేదీ వరకు స్విమ్స్ హాస్పిటల్‌లోనే ఉన్నారు. చిత్తూరు నుండి నరేంద్రబాబు కుమారుడు రేవంత్ వచ్చే స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తల్లిని చూసి తుడా క్వార్టర్స్ ఇంటికి వచ్చాడు. ఇంటికి రాగానే గది తెలుపులు తెరిచి ఉంచడం గమనించి తండ్రికి సమాచారం అందించాడు. దొంగతనం చోటు చేసుకుందని గుర్తించి పోలీసులకు సమా చారం అందించారు. సమాచారం అందుకున్న తిరుచా నూరు పోలీసులు దొంగతనం ఘటన జరిగిన ఇంటిని పరిశీలించి, క్లూస్ టీంతో వేలి ముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్నాథం తెలిపారు.

రాయల చెరువులో పడి యువకుడు మృతి

రాయలచెరువులో పడి ఉన్న స్కూటర్, లోకేష్ మృతదేహం లోకేష్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - రామచంద్రపురం : ప్రమాదవశాత్తు రాయల చెరువులో పడి, రాయలచెరువు పేట గ్రామానికి చెందిన పెనుగొండ లోకేష్ (23) మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామచంద్రాపురం పోలీసుల సమాచారం మేరకు పెనుగొండ లోకేష్ శనివారం రాత్రి 8 గంటల సమయంలో రామచంద్రాపురం నుండి బైక్‌పై రాయలచెరువు పేటకు వెళుతుండగా, రాయలచెరువు కట్ట సమీపాన ఉన్న మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుకు కుడివైపున పక్కనే ఉన్న రాయలచెరువు నీటిలో వాహనంతో పాటు పడిపోయి మృతి చెందాడు. అతని జాడ తెలియక, ఆదివారం కుటుంబ సభ్యులు రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ నెంబర్‌తో లొకేషన్ ట్రాకింగ్ తీయడంతో రాయలచెరువులో లోకేష్ మృత దేహం, ద్విచక్ర వాహనం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఆర్ సి పురం ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి ఆర్‌టిసి ఉద్యోగి ఆత్మహత్య

శ్రీనివాసులు మృత దేహం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆర్టీసీ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వెంకటగిరి ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు(48) తిరుచానూరు రైల్వే స్టేషన్ సమీపంలో, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని, మృత దేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం, పెద్ద కన్నలి వద్ద మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిదు. తను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతోనే మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నామన్నారు.

గడ్డివాము దగ్ధం

దహనమైన గడ్డివాము

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పాత కక్ష్యల నేపథ్యంలో గడ్డి వామును దగ్ధం చేసిన ఘటన ఆదివారం తొట్టంబేడు మండలంలోని గుండెలిగుంట మిట్టలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అర్జున్ రెడ్డి పశువుల కోసం గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. అయితే కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఆ గడ్డివామును తగలబెట్టారని అర్జున్ రెడ్డి తెలిపారు. విచారించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు గీత కులాల మద్యం దుకాణాలకు లక్కీడ్రా

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఈనెల 10వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టరేట్లో గీత కులాల వారికి మద్యం దుకాణాలను లక్కీ డ్రా పద్ధతిలో కేటాస్తామని తిరుపతి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో 23 మండలాలకుగాను ముగింపు తేదీ 8 నాటికి ఆన్లైన్, ఆఫ్లైన్, హైబ్రిడ్ పద్ధతుల ద్వారా 185 దరఖాస్తులు వచ్చాయన్నారు. అత్యధికంగా తిరుపతి రూరల్ మండలానికి సంబంధించి 30 దరఖాస్తులు, అత్యల్పంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీ, దక్కిలి మండలానికి ఒక్కొక్క దరఖాస్తు వచ్చాయన్నారు.

ఘనంగా ప్రారంభమైన సిపిఆర్ మంగళ బుకింగ్స్


సిపిఆర్ మంగళ బుకింగ్స్ ప్రారంభం చేస్తున్న సంస్థ డైరెక్టర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రజల జీవన ప్రమాణాలకు ఆత్యాధునిక సౌకర్యాలతో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్న ప్రముఖ సంస్థ సిపిఆర్ తన ఖాతాలో మరో అధునాతన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి - కరకంబాడి మార్గం, మంగళం గ్రామం సమీపంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో సిపిఆర్ మంగళ టు బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మాణం ప్రారంభించింది. ఈ అపార్ట్‌మెంట్ల బుకింగ్స్ ప్రారంభ ధర రూ.37 లక్షలుగా నిర్ణయించినట్లు నిర్మాణ సంస్థ డైరెక్టర్లు కాశి విశ్వనాథ్, లోకేష్, వినీషలు పేర్కొన్నారు. తిరుపతి - కరకంబాడి రాష్ట్ర రహదారికి 150 మీటర్ల దూరంలో మంగళం గ్రామం సమీపంలో నిర్మితమవుతున్న సిపిఆర్ మంగళలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తున్నామని, ఎవరైతే తమ ఇల్లు ఇలా ఉండాలని ఆలోచనతో ఉంటారో.. వారి ఆలోచనకు తగ్గట్టుగా అన్ని వసతులతో మంచి ఆర్కిటెక్చర్‌తో నిర్మాణం చేస్తున్నామన్నారు. పార్కింగ్, క్లబ్ హౌస్‌లతో, ప్రీమియం లొకేషన్లో సిపిఆర్ మంగళ ఉందన్నారు. బుకింగ్స్ ప్రారంభమయ్యాయని, కలల ఇంటిని సొంతం చేసుకునేవారు త్వరపడాలని విజ్ఞప్తి చేశారు.